సాక్షి ఖమ్మం

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



'కళాతపస్వి'తో అనుబంధం

కళాతపస్వి విశ్వనాథ్ పలుమార్లు జిల్లాకు రాగా, ఆయనతో అనుబంధాన్ని జిల్లావాసులు గుర్తు చేసుకుంటున్నారు. 10లో



బావి స్థలం కోసం ఘర్షణ

ప్రజల అవసరాల పేరిట బావి తవ్విన స్థలం విషయమై రఘునాథపాలెం మండలం రేగులచెలకలో ఘర్షణ చోటుచేసుకుంది. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 17°

వాతావరణం

జిల్లాలో శనివారం చలి ప్రభావం అంతగా ఉండదు. మధ్యాహ్న ఉష్ణోగ్రతలు కొద్దిమేర పెరిగే అవకాశం ఉంది.

అడ్డూ అదుపు లేదు..

జిల్లా కేంద్రంలో కేఎంసీ కార్యాలయానికి సమీపాన, బైపాస్ రోడ్డు వెంట, నూతన బస్టాండ్‌కు కూతవేటు దూరంలో ఓ బహుళ అంతస్తుల భవనం నిర్మించారు. ఈ భవన నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతి ఇచ్చినా, నిబంధనలు విస్మరించి నిర్మాణం చేపట్టారు. సెట్ బ్యాక్ వదలకుండా, రోడ్డుపైకి వచ్చేలా మెట్లు నిర్మించారని కొందరు కేఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించలేదు. ఈ భవన నిర్మాణం అనుమతులకు విరుద్ధంగా ఉందని ఆ విభాగంలోని కొందరు ఉద్యోగులే అంగీకరిస్తుండడం గమనార్హం.

- నిబంధనలను విస్మరించి మరీ నిర్మాణాలు
- కేఎంసీ పరిధిలో పలువురి ఇష్టారాజ్యం
- డ్రెయిన్లు, రోడ్లను ఆక్రమిస్తున్న నిర్మాణదారులు
- నోటీసులతో సరిపెడుతున్న టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు



ఖమ్మం బైపాస్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం

నోటీసులు ఇచ్చాం...

అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ కోరగా.. తమ దృష్టికి రాగానే నోటీసులు ఇస్తున్నామని చెప్పడం గమనార్హం. ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్న వారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాల విషయంలో ఎలా స్పందిస్తారో మాత్రం చెప్పడం లేదు.

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి వేగంగా జరుగుతుండడంతో నివాస గృహాలతో పాటు వ్యాపార సముదాయాల నిర్మాణాలు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. ఎక్కడ చూసినా మూడు నుండి ఐదు అంతస్తుల భవనాల నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి. ఇందులో పలు కమర్షియల్ ప్రాంతాల్లో భవనాల నిర్మాణం అడ్డగోలుగా జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చేసి చేతులు దులుపుకుంటున్న అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నిర్మాణదారులు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. చాలామంది అనుమతిపత్రంలో పొందుపర్చిన ప్లాన్‌ను విస్మరిస్తున్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇక 168 జీఓ ప్రకారం భవన నిర్మాణాలకు అనుమతి తీసుకున్నాకే పనులు చేపట్టాలని మున్సిపల్ చట్టం చెబుతున్నా కొందరు పట్టించుకోవడం లేదు. ఈక్రమంలో ఎవరైనా ఫిర్యాదు చేస్తే స్పందించని అధికారులు ఆతర్వాత కూడా నోటీసులతో సరిపెడుతున్నారు.

వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు...

నగరంలో పలుచోట్ల ఇండిపెండెంట్ హౌజ్‌లతో పాటు అపార్ట్‌మెంట్లకు అనుమతి రాకుండానే పనులు మొదలుపెడుతున్నారు. ఇలాంటి నిర్మాణాలపై కేఎంసీకి ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వస్తూనే ఉన్నాయి. ఇక కొత్తబస్టాండ్, బైపాస్‌రోడ్డు వెంట భవనాలు నిర్మిస్తున్న వారు రోడ్లు, డ్రెయినేజీలను ఆక్రమిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రధానంగా రాపర్తినగర్, రమణగుట్ట, వికలాంగుల కాలనీ, బైపాస్‌రోడ్డు, శ్రీనివాసనగర్, ముస్తఫానగర్, కొత్తూరు, ధంసలాపురం, బోనకల్ రోడ్డు ఇరువైపులా, మమత రోడ్డు, అల్లీపురం రోడ్డు, రోటరీనగర్, టేకులపల్లి, బల్లేపల్లి ఇలా అనేక ప్రాంతాల్లో అనుమతి లేకుండానే భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, ఎక్కడైనా నిర్మాణాలు జరుగుతున్నప్పుడు అనుమతి ఉందా, లేదా అనే విషయమై కాక అనుమతి మేరకే నిర్మాణాలు చేపడుతున్నారా అని పరిశీలించాల్సిన అధికార యంత్రాంగం అది తమ పని కాదన్నట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

'ప్లానింగ్' మరిచి కాసుల వేట

కేఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి వేళ్లూనుకుపోయిందనే ఆరోపణలు వస్తున్నాయి. టౌన్ ప్లానింగ్‌లో ఉన్నతాధికారి మొదలు సిబ్బంది వరకు చేతులు తడిపితే చాలు నిబంధనలు పట్టించుకోకుండా అనుమతులు ఇస్తున్నారని.. ఆపై పర్యవేక్షణ కూడా చేయడం లేదని తెలుస్తోంది. బైపాస్ రోడ్డులో కొత్తబస్టాండ్ నిర్మించాక ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు నానాటికీ పెరుగుతుండడానికి టౌన్ ప్లానింగ్ అధికారులే కారణమనే విమర్శలున్నాయి. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం గేటు ఎదురుగా నిర్మించిన నాలుగు అంతస్తుల భవనానికి పార్కింగ్ సౌకర్యం లేకపోగా, సెల్లార్‌లోనూ నిర్మాణాలు చేపట్టారు. ప్రతిరోజు కేఎంసీ కార్యాలయానికి ఈ భవనం మీదుగానే వచ్చివెళ్లే అధికారులకు ఎందుకు కనిపించడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఇక మెడికల్ కళాశాలపై దృష్టి

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- కేటాయించిన భవనాలు పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: కొత్త కలెక్టరేట్ ప్రారంభం కావడం.. పాత కలెక్టరేట్ నుంచి అన్ని కార్యాలయాలను అక్కడకు తరలించిన నేపథ్యాన మెడికల్ కాలేజీలో జరగాల్సిన ఏర్పాట్లపై దృష్టి సారించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఈమేరకు భవనాలు, సదుపాయాల కల్పనపై శుక్రవారం ఆయన వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లుతో కలిసి శుక్రవారం సాయంత్రం సమీక్షించారు. పాత కలెక్టరేట్, ఈవీఎం గోదాం, రోడ్లు భవనాల శాఖ కార్యాలయాలను పరిశీలించాక కలెక్టర్ మాట్లాడుతూ వైద్య కళాశాలకు సంబంధించి భవన నిర్మాణాలు, పాత భవనాల్లో మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సివిల్ పనులకు రూ.68 కోట్లు, సదుపాయాల కల్పనకు రూ.98 కోట్లు కలిపి రూ.166 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం కానున్న దృష్ట్యా భవనాల మరమ్మతులపై దృష్టి సారించాలని, బాలురు, బాలికలకు హాస్టళ్ల కోసం విడివిడిగా భవనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, డీఆర్వో శిరీష, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాస్, టీఎస్ ఎంఎస్ఐడీసీ ఈఈ ఉమామహేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఈఈ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

కారేపల్లిలో సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించిన సీపీ వారియర్



సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించిన సీపీ వారియర్, పక్కన అధికారులు

కారేపల్లి: నేరాలను అదుపు చేయడంతో పాటు నేరాలు జరిగిన సమయాన నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు కీలకంగా నిలుస్తామని ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ అన్నారు. సీసీ కెమెరాలు ఉన్నాయంటే పోలీస్‌స్టేషన్ ఉన్నట్లేనని తెలిపారు. కారేపల్లిలో సింగరేణి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, సీసీ కెమెరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం సీఐ ఆరిఫ్ అలీఖాన్ అధ్యక్షతన ప్రజలకు ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో సీపీ మాట్లాడుతూ సింగరేణి మండల వ్యాప్తంగా ప్రజలు సీసీ కెమెరాలను స్వచ్ఛందంగా ఏర్పాటుచేసుకుంటుండడం అభినందనీయమన్నారు. కాగా, చేతన ఫౌండేషన స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన ట్రైసైకిల్‌ను పోలంపల్లికి దివ్యాంగుడు భూపతికి సీపీ అందజేశారు. ఖమ్మం రూరల్ ఏసీపీ జి.బస్వారెడ్డి, ఎంపీపీ మాలోత్ శకుంతల, కారేపల్లి, కామేపల్లి ఎస్ఐలు పుష్పాల రామారావు, కిరణ్, సర్పంచ్ మాలోత్ కిషోర్, బీఆర్ఎస్ నాయకుడు ఇస్లావత్ బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం

బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



మధిరలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మధిర/ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలనకు చరమగీతం పలికేందుకు ప్రతీ కార్యకర్త సన్నద్ధంగా ఉండాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మధిరలో ఏర్పాటుచేసిన బీజేపీ కార్యాలయాన్ని మాజీ మంత్రి రవీందర్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆతర్వాత ఏర్పాటుచేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలో అవినీతి, కుటుంబ పాలనను అంతమొందించి, బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందని తెలిపారు. మధిరలో సీఎల్పీ నేత, జెడ్పీ చైర్మన్ ఉన్నా అభివృద్ధి జరగడం లేదని ఆరోపించారు. ఈక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ చీకటి స్నేహాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, మండల, పట్టణ అధ్యక్షులు గుండా చంద్రశేఖర్ రెడ్డి, పాపట్ల రమేష్‌తో పాటు పెరుమాళ్లపల్లి విజయరాజు, చిలువేరు సాంబశివరావు, కోటమర్తి సుదర్శన్, దేవరకొండ కోటేశ్వరరావు, వేణుగోపాల్ రెడ్డి, కొమ్మినేని సుధాకర్, జైపాల్, శ్రీను, అప్పారావు, మోహన్‌రావు పాల్గొన్నారు. కాగా, ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ ఎంపీ రవీందర్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణలో రాబోయేది డబుల్ ఇంజన్ సర్కారేనని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ ఇచ్చిన హామీలను విస్మరించిన విషయమై ప్రజల్లో కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడగా, నాయకులు రుద్ర ప్రదీప్, నున్న రవికుమార్, వేల్పుల సుధాకర్, మంద సరస్వతి, చావాకిరణ్, బీ.పీ.నాయక్, భద్రం, శ్యాం, కృష్ణనాయక్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల బాహాబాహీ

పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్, ప్రవేశాలు రద్దు

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం బైపాస్‌రోడ్డులోని ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహం(ఏ)లో విద్యార్థుల నడుమ ఘర్షణ జరిగింది. ఇది చిలికిచిలికి గాలివానలా మారగా.. విషయం పోలీసు స్టేషన్‌కు చేరింది. హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థి.. మరో ముగ్గురు విద్యార్థులకు మధ్య ఇటీవల వివాదం జరిగింది. ఈ విషయాన్ని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంతలోనే ఘర్షణతో మనస్థాపానికి చెందిన విద్యార్థి బయట ఉండే తన స్నేహితులకు చెప్పగా వారు ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులను అడ్డుకుని ఘర్షణ పడ్డారు. దీంతో ఘటనపై గురువారం రాత్రి వసతిగృహం సంక్షేమ అధికారి విద్యార్థులతో కలిసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు శుక్రవారం ఉదయం హాస్టల్‌కు వచ్చి విచారణ చేపట్టమే కాక స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాగా, హాస్టల్ విద్యార్థుల నడుమ ఘర్షణను తీవ్రంగా పరిగణించిన ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ, ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీలత ఆరా తీశారు. శుక్రవారం సాయంత్రం హాస్టల్‌కు వెళ్లి వివరాలు తెలుసుకున్న వారు, ఘర్షణకు కారణమైన ఇద్దరు విద్యార్థుల ప్రవేశాలను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పలువురు ఎస్సైల బదిలీ

ఖమ్మంక్రైం: కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్సైల బదిలీ జరిగింది. ఈమేరకు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సీసీఎస్‌లో పనిచేస్తున్న శంకర్‌రావును కొణిజర్ల ఎస్సైగా, కొణిజర్ల ఎస్సై యయాతిరాజును ఖమ్మం వన్ టౌన్‌కు బదిలీ చేశారు. అలాగే, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రఘును కల్లూరుకు, కల్లూరు ఎస్ఐ కొండల్ రావును ఖమ్మం టూ టౌన్‌కు, వెయిటింగ్‌లో ఉన్న మహేష్‌ను సీసీఆర్బీ ఎస్సైగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అంతర్జాతీయ చెస్ టోర్నీకి జిల్లా విద్యార్థిని



జి.చరిష్మా

ఖమ్మంమయూరిసెంటర్: ప్రపంచ స్కూల్ చెస్ టోర్నీకి ఖమ్మం జిల్లాలోని దానవాయిగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి జి.చరిష్మా ఎంపికైంది. తమిళనాడు రాష్ట్రంలో ఇటీవల జరిగిన 11వ జాతీయ స్థాయి స్కూల్ చాంపియన్‌షిప్‌లో ఆమె 4.5 పాయింట్లతో 19వ స్థానంలో నిలిచింది. దీంతో ప్రపంచ చెస్ టోర్నీలో భారత దేశం తరఫున పాల్గొనేందుకు ఎంపిక చేశారు. ఈ టోర్నీ గ్రీస్ దేశంలో ఏప్రిల్ 13 నుంచి 23వ తేదీ వరకు జరగనుందని ప్రిన్సిపాల్ టీఆర్.నిరుపమ, పీఈటీ వి.దీప్తి మంగమ్మ తెలిపారు.

ఫోరం కేసులు కూడా పరిష్కారం

జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్: ఈనెల 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులే కాక వినియోగదారుల ఫోరం కేసులను కూడా పరిష్కరించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. కమిషన్ సభ్యులతో శుక్రవారం సమావేశమైన ఆయన మాట్లాడారు. కమిషన్ తీర్పుల వల్ల కొన్ని సందర్భాలలో కక్షిదారులు అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉంటుందని.. కానీ లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పు అంతిమమని తెలిపారు. ఈ సమావేశంలో న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, ఫోరం అధ్యక్షురాలు వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత పాల్గొన్నారు.

కేఎంసీ ముందంజలో నిలవాలి..

నగర మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: స్వచ్ఛ సర్వేక్షణ్ - 2023లో ఖమ్మం మున్సిపల్ కార్పొరేట్ మొదటి ర్యాంకు సాధించేలా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని నగర మేయర్ పునుకొల్లు నీరజ కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఈసారి ఖమ్మం ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ దిశగా అడుగులు వేస్తోందని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దానవాయిగూడెంలోని ఎకరం స్థలంలో ఎస్ఎఫ్‌టీపీ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే, 16 ప్రైవేట్ సెప్టిక్ ట్యాంకు వాహనాలను సమకూర్చడమే కాక మూడేళ్లకోసారి సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు సాధించడానికి ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని మేయర్ కోరారు.

ముగిసిన 'ఎస్‌పీఎల్' టోర్నీ

'సాక్షి' మీడియా ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ సౌజన్యంతో వారం రోజులుగా జరుగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ శుక్రవారం ముగిసింది. సీనియర్స్ విభాగంలో ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్, జూనియర్స్ విభాగంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్లు విజేతలుగా నిలిచాయి. అలాగే, వరుసగా రెండు విభాగాల్లో కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కాలేజీ, బొమ్మ డిప్లొమా కాలేజీ జట్లు రన్నరప్‌గా నిలవగా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. – ఖమ్మం స్పోర్ట్స్ - 8లో...



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సుధాకర్ పైప్స్ ప్రతినిధి రవిశంకర్, సాక్షి ఉద్యోగులు

లెక్క తేలింది !

గతంతో పోలిస్తే పెరిగిన ధాన్యం కొనుగోళ్లు



జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి లెక్క తేలింది. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన ఈ ఏడాది 234 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 223 కేంద్రాలకు ధాన్యం రాగా 2,80,618.760మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 42,101మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. అయితే, గతేడాది 256 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, 236కేంద్రాల్లో 38,910మంది రైతుల నుంచి 1,78,630.400మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అంటే గతం కంటే ఈ ఏడాది తక్కువ కేంద్రాలు ఉన్నా 2వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా కొనుగోలు చేయడం విశేషం. ఈ సందర్భంగా పౌరసరఫరాల సంస్థ అధికారులు సోములు, నర్సింహారావు మాట్లాడుతూ కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్ ఆదేశాలతో రైతులకు ఎక్కడా ఇబ్బందులు ఎదురుకాకుండా ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేశామని తెలిపారు. - ఖమ్మం సహకారనగర్

న్యూస్‌రీల్

పదోన్నతి కోసం ఆన్‌లైన్‌లో నమోదు



ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న డీఈఓ శర్మ

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ వేగంగా సాగుతోంది. సీనియారిటీ జాబితా ఆధారంగా అర్హులైన ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ)ల పదోన్నతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. అలాగే, సర్టిఫికెట్ల పరిశీలన కూడా పూర్తయిన నేపథ్యాన శుక్రవారం నుంచి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ప్రారంభించారు. ఈమేరకు ప్రక్రియను డీఈఓ సోమశేఖరశర్మ పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

బోధనపై ప్రభావం ఉండొద్దు

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ వల్ల పదో తరగతి విద్యార్థులకు బోధనలో ఆటంకం కలగకుండా చూడాలని డీఈఓ సోమశేఖరశర్మ ఆదేశించారు. ఆయన తన కార్యాలయం నుంచి శుక్రవారం హెచ్ఎంలు, కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమావేశమై పలు సూచనలు చేశారు. సిలబస్ త్వరగా పూర్తిచేసి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. డీసీఈబీ సెక్రటరీ నారాయణ, ఏఎంఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జిగా రాంప్రసాద్‌రావు

ఖమ్మం లీగల్: ఖమ్మం ప్రత్యేక షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్ కులాల ప్రత్యేక న్యాయస్థానం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా దేవినేని రాంప్రసాద్‌రావు నియమితులయ్యారు. అలాగే, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తిగా వెంపటి అపర్ణ, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తిగా ఎం.ఎస్.అర్చనాకుమారి, ఆరో అదనపు జిల్లా కోర్టు(సత్తుపల్లి) న్యాయమూర్తిగా టి.శివరాంప్రసాద్‌ను నియమించారు. ఇక ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తిగా ఉన్న సంతోష్‌కుమార్‌ను ఎల్‌బీ.నగర్ ఒకటో అదనపు కుటుంబ న్యాయస్థానానికి బదిలీ చేశారు. ఈ మేరకు హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వాల్సిందే..



అధికారులతో మాట్లాడుతున్న రైతులు

ఎర్రుపాలెం: నాగపూర్ – అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు ఎకరానికి రూ.30లక్షల పరిహారం ఇవ్వాల్సిందేనని రైతులు స్పష్టం చేశారు. భూమి కోల్పోనున్న రేమిడిచర్ల రెవెన్యూ రైతులతో మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఆర్డీఓ రవీంద్రనాథ్ సమావేశమయ్యారు. ప్రభుత్వం ఎకరాకు రూ.12లక్షల మేరకు పరిహారం చెల్లిస్తుందని ఆర్డీఓ వెల్లడించగా, రైతులు మాత్రం తమకు రూ.30లక్షలు ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. రిజిస్ట్రేషన్ విలువ రూ.4లక్షలు ఉండగా, ఒకటిన్నర రెట్ల పరిహారం చెల్లించేందుకు మాత్రమే అవకాశం ఉందని ఆర్డీఓ తెలిపారు. ఈమేరకు రైతుల డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈసమావేశంలో తహసీల్దార్ తిరుమలాచారి, డీటీ కరుణాకర్‌రెడ్డితో పాటు రైతులు పాల్గొన్నారు.

తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

ఖమ్మంవైద్యవిభాగం: తల్లిపాల ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలింతలకు అవగాహన కల్పించాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు సూచించారు. ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు శిశువులకు ఆహారం అందించాల్సిన పద్ధతులు, తల్లిపాల ప్రాముఖ్యతపై ఆస్పత్రి వైద్యులు, నర్సులకు శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి దగ్గరకు చేర్చి ఆలస్యం చేయకుండా తల్లి పాలు పట్టించేలా అవగాహన పెంపొందించాలని సూచించారు.

క్లుప్తంగా

అదిగో పులి...

● వదంతులపై అధికారుల ఆరా



తండా పరిసరాల్లో పరిశీలిస్తున్న అధికారులు

రఘునాథపాలెం: మండలంలోని వాంకుడోత్ తండా పరిసరాల్లో పులి సంచరించినట్లు ప్రచారం జరగడంతో అటవీశాఖ అధికారులు ఆరా తీశారు. డీఆర్‌ఓ లక్ష్మీపతి, బీట్ ఆఫీసర్లు రవి, డేనియల్, జ్యోతి బృందం శుక్రవారం తండా పరిసరాల్లో పరిశీలించి రైతులతో మాట్లాడారు. అయితే, ఎక్కడ కూడా పులి తిరిగిన ఆనవాళ్లు, పాదముద్రలు లభించలేదని వారు తెలిపారు. కాగా, రైతులకు ఎలాంటి అనుమానం ఉన్న తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాటోత్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి



నరేష్ (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండలో ఖమ్మం – ఇల్లెందు ప్రధాన సెంటర్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. కామేపల్లి మండలం గోపాలపురానికి చెందిన బానోతు నరేష్(28) పురుగుల మందుల కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, శుక్రవారం ఉదయం ఇంటి నుండి ఖమ్మంలోని కార్యాలయానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. మంచుకొండ సెంటర్‌లో ఖమ్మం నుండి ఇల్లెందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆయనను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నరేష్‌కు ఏడాది క్రితం వివాహం జరగగా, ప్రస్తుతం ఆయన భార్య నాలుగు నెలల గర్భిణి. ఇంటి నుంచి బయలుదేరిన అరగంటలోపే మృత్యువాత పడడంతో అక్కడకు వచ్చిన కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ

● తృటిలో తప్పిన ప్రాణాపాయం



లారీ ఢీకొట్టడంతో దెబ్బతిన్న కారు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖమ్మం – ఇల్లెందు రోడ్డు ఖానాపురం సెంటర్‌లో కారును లారీ ఢీకొట్టిన ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా.. ముగ్గురు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఇల్లెందు వైపు నుండి వస్తున్న కారును వెనక నుండి లారీ వేగంగా ఢీకొట్టింది. ఈఘటనలో కారు డివైడర్‌ను ఢీకొని ఆగగా నుజ్జునుజ్జయింది. అయితే, డ్రైవర్‌తో పాటు ముగ్గురు కారులో ఉన్నా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, క్రేన్ సాయంతో కారును తీయించి రాకపోకలు పునరుద్ధరించారు. కారేపల్లి వాసులు కారులో ఖమ్మం వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని ఖమ్మం అర్బన్ సీఐ రామకృష్ణ తెలిపారు.

పోలీసుల అదుపులో వ్యాపారులు?

కూసుమంచి: రైతుల నుంచి ధాన్యంతో పాటు మిర్చి, పత్తి కొనుగోలు చేసి డబ్బు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న ఇద్దరు వ్యాపారులను కూసుమంచి పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మండలంలోని కిష్టాపురం, చేగొమ్మ, చౌటపల్లికి చెందిన రైతుల వద్ద సదరు వ్యాపారులు అధిక ధర ఇస్తామని నమ్మబలికి వరి, పత్తి, మిర్చి కొనుగోలు చేశారు. అయితే, రోజులు గడుస్తున్నా డబ్బు ఇవ్వకపోవడంతో బాధిత రైతులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో విచారణ చేపట్టి వ్యాపారులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈవిషయమై ఎస్సై రమేష్‌ను వివరణ కోరగా రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు.

పోక్సో కేసు నమోదు

సత్తుపల్లి టౌన్: మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. బాలికను వేధిస్తున్నట్లు అందిన ఫిర్యాదుతో పానం సందీప్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,200	7,200
కందులు	6,300	6,300
మినుములు	6,700	6,350
మిర్చి	18,200	12,000
తాలు మిర్చి	10,000	7,500
పత్తి	7,700	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,881

ఎస్‌పీఎల్ విజేతలు.. ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్, శ్రీచైతన్య

● రన్నరప్‌గా కేఎండీసీ, బొమ్మ కాలేజీ జట్లు
● ట్రోఫీలు అందజేసిన కలెక్టర్ వీ.పీ.గౌతమ్
● విజయవంతంగా ముగిసిన 'సాక్షి' ప్రీమియర్ క్రికెట్ టోర్నీ



సీనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, తదితరులు



జూనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: 'సాక్షి' మీడియా ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ కంపెనీ సౌజన్యంతో వారం రోజులుగా ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల, సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ శుక్రవారం ముగిసింది. ఈమేరకు హోరా హోరీగా సాగిన ఫైనల్స్‌లో సీనియర్స్ విభాగం నుంచి ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల, జూనియర్స్‌లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్లు విజేతలు గా నిలిచాయి. ఇక రన్నరప్‌గా కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల, బొమ్మ డిప్లొమా కాలేజీ జట్లు నిలిచాయి. ఈమేరకు విజేతలతో పాటు రన్నరప్ నిలిచిన జట్లకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. అతర్వాత కలెక్టర్ గౌతమ్‌తో పాటు సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, టేబుల్ టెన్నిస్ సంఘం జిల్లా కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి, సీనియర్ క్రీడాకారులను జోజిచాకో, ఫారుఖ్‌ను సాక్షి ఉద్యోగులు ఘనంగా కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహనకృష్ణ, బ్యూరో ఇన్‌చార్జ్ బొల్లం శ్రీనివాస్, టీ.వీ. ప్రతినిధి పి.మహేందర్, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల పీడీ డాక్టర్ బి.వెంకన్న, సాక్షి యాడ్స్ మేనేజర్ ఎన్.శేషు, ఈవెంట్ మేనేజర్ బోడపట్ల వేణు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజుతో పాటు ఉద్యోగులు నెల్లూరి ఉపేందర్, జుజ్జూరు ఉపేందర్, గుడిసె రాంబాబు, ఏ.వీ.రామారావు, కె.శ్రీనివాస్, ఆసిఫ్, శ్రీనివాసాచారి, జి.సతీష్, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

– రవిశంకర్, సుధాకర్ పైప్స్ ప్రతినిధి

వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహించడంలో తాము ఎల్లవేళలా ముందు నిలుస్తామని సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ రీజినల్ సేల్స్ మేనేజర్ రవిశంకర్ తెలిపారు. అలాగే క్రీడల్లో రాణించే వారికి అండగా ఉంటున్నట్లు చెప్పారు.

హోరాహోరీగా ఫైనల్స్

● సీనియర్స్ విభాగంలో ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల(ఖమ్మం) – కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల(ఖమ్మం) జట్ల మ్యాచ్‌లో ఫైనల్స్ జరగగా టాస్ గెలిచిన కవిత కాలేజీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత పది ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 64 పరుగులు చేయగా, జట్టులో లోకేష్ 14 పరుగులు చేశాడు. ఇక ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ బౌలర్లు రాజేష్, దీపక్ రెండేసి వికెట్లు తీసుకున్నారు. ఆతర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ జట్టు తొమ్మిది ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈజట్టులో అఖిల్ 16, విశాల్ యాదవ్ 13, విఘ్నేష్, సాయిచంద్ 11 చొప్పున పరుగులు చేయగా, కవిత కాలేజీ బౌలర్లలో ఫరీద్ రెండు, లోకేష్ ఒక వికెట్ పడగొట్టారు.

● జూనియర్స్ విభాగంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల(ఖమ్మం) – బొమ్మ డిప్లొమా కళాశాల(ఖమ్మం) జట్ల మ్యాచ్ హోరాహోరీగా సాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీ చైతన్య జట్టు పది ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 98 పరుగులు చేయగా జట్టులో జయంత్ మూడు ఫోర్లతో 27, గౌతమ్ నాలుగు ఫోర్లతో 23 రన్స్, విఘ్నేష్ 17 పరుగులు సాధించారు. బొమ్మ కళాశాల బౌలర్లలో సైదులు రెండు, ఉదయ్, సాగర్ ఒక్కో వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేసిన బొమ్మ కళాశాల పది ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసినా తృటిలో ఓడిపోయింది. ఈ జట్టులోనవీన్ ఆరు ఫోర్లతో 41 పరుగులు, బషీర్ 13, ముసాకీర్ 11 పరుగులు చేశారు.

'సాక్షి' సేవలు అభినందనీయం

– గౌతమ్, ఖమ్మం జిల్లా కలెక్టర్



కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను సన్మానిస్తున్న 'సాక్షి' ఉద్యోగులు

సాక్షి మీడియా గ్రూప్ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. ప్రజాసమస్యలను వెలికితీయడంలో కీలకపాత్ర పోషిస్తుండడమే కాక... విద్యార్థుల కోసం పోటీ పరీక్షలు, పేద మహిళల ఉపాధికి శిక్షణ ఇవ్వడంలో ముందు నిలుస్తోందని తెలిపారు. ఇదే తరహాలో వర్ధమాన క్రీడాకారులను వెలికితీసేందు కు క్రికెట్ టోర్నీ నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఇలాంటి టోర్నీలు ఔత్సాహిక క్రికెటర్లకు ప్రోత్సాహకరంగా ఉంటాయని.. భవిష్యత్‌లో మరిన్ని టోర్నీలు జరిపేలా 'సాక్షి' యాజమాన్యం కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.



సీనియర్స్ రన్నరప్‌గా నిలిచిన కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల జట్టు



జూనియర్స్ రన్నరప్‌గా నిలిచిన బొమ్మ డిప్లొమా కళాశాల జట్టు

గ్రంథాలయ అభివృద్ధికి ప్రతిపాదనలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఉమామహేశ్వరరావు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి రూ.4.56 కోట్ల మేర నిధుల కోసం రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకులకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం ఖమ్మంలోని కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చేపట్టాల్సిన పనులకు నిధుల మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి కార్యదర్శి అర్జున్, వయోజన విద్య ఉపసంచాలకులు ధనరాజు, వివిధ శాఖల అధికారులు శ్రీనివాసరావు, రాజ శేఖర్, ఎస్.కే.మగ్బూల్ పాల్గొన్నారు.

కంటిచూపుపై శ్రద్ధ వహించాలి



వృద్ధులకు అద్దాలు అందజేస్తున్న న్యాయమూర్తి

ఖమ్మంలీగల్: వృద్ధులందరూ కంటి చూపు విషయంలో శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా సూచించారు. స్థానిక జీవనసంధ్య వృద్ధాశ్రమంలో ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణతో పాటు నిఖిత, నాగమణి, బుగ్గవేటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన గణేష్



సీపీ వారియర్‌ను కలిసిన ఏసీపీ

ఖమ్మంక్రైం: నగర ఏసీపీగా నియమితులైన పీ.వీ.గణేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పంజాగుట్టలో విధులు నిర్వర్తిస్తున్న ఆయనను ఖమ్మం బదిలీ చేయగా విధుల్లో చేరారు. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎస్ఐ, సీఐగానే కాకుండా ఏసీపీగా కూడా పనిచేశారు. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించాక సీపీ విష్ణు ఎస్.వారియర్, అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్ర బోస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు, నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నందున నాణ్యమైన విద్య అందుతుందని అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా తెలిపారు. మండలంలోని చినమండవ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా వచ్చేలా ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తూ మెరుగైన బోధన అందించాలని సూచించారు. జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, సర్పంచ్ కాశిమాల వెంకట్రావమ్మ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ మంగీలాల్, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్‌తో పాటు పర్సగాని వీరబాబు, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఉష, పురుషోత్తంరావు తదితరులు పాల్గొన్నారు.

పంటలు పాడవుతున్నాయని రైతుల ఆందోళన



టిప్పర్లను అడ్డుకుని బైఠాయించిన రైతులు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం రెవెన్యూ పరిధి గుట్టల నుంచి వారం రోజులుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల కోసం మట్టి తరలిస్తున్న వాహనాల కారణంగా పంటలకు నష్టం జరుగుతోందని ఆరోపిస్తూ రైతులు శుక్రవారం టిప్పర్లను అడ్డుకున్నారు. రోడ్డుకు టెంట్ వేసి బైఠాయించి ధర్నాకు దిగారు. అన్నారుగూడెం–నరసింహారావుపేట మధ్య గుట్టల నుంచి వందలాది టిప్పర్లతో మట్టి తరలిస్తుండడంతో సమీపంలోని మిర్చి తోటలపై దుబ్బ పడుతోందని వాపోయారు. పంట చేతికొచ్చే సమయాన ఇలా చేయడం సరికాదని, తొలుత బీటీ రోడ్డు వేశాక మట్టి తరలించాలని సూచించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టిప్పర్లు నిలిచిపోగా, ఎస్ఐ సురేష్ చేరుకుని కాంట్రాక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని నచ్చచెప్పడంతో రైతులు ఆందళన విరమించారు.

రైతుల అంత్యక్రియలు పూర్తి



లక్ష్మారెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

కల్లూరు రూరల్: మండలంలోని కప్పలబంధం వద్ద గురువారం సాయంత్రం సాగర్ కాల్వలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన రైతులు గుర్రాల లక్ష్మారెడ్డి, లక్కిరెడ్డి రామిరెడ్డి మృతదేహాలకు బంధువుల రోదనల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. గురువారం సాయంత్రం వారిద్దరు కాలువలో మునగగా, రాత్రి తర్వాత మృతదేహాలు లభించాయి. ఈమేరకు పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు పోలీసులు అప్పగించారు. కాగా, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, ఎంపీపీ బీరవెల్లి రఘు, సర్పంచ్ నందిగామ ప్రసాద్, టీ పీసీసీ అధికార ప్రతినిధి మానవతారాయ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, ఎం.డీ.ఇస్మాయిల్, పాలెపు రామారావు, డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి చందర్‌రావు, కె.ప్రసాద్, వెంకటరత్నం, రామకృష్ణ, లక్ష్మణ్‌రావు తదితరులు రైతుల మృతదేహాల వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

సహస్ర కలశాభిషేకానికి అంకురార్పణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మాఘమాసంలో జరిగే సహస్రకలశాభిషేకోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మేళతాళాల నడుమ అర్చకులు పవిత్ర గోదావరి నుంచి నదీ జలాలను తీసుకొచ్చి ఉత్సవాలను ప్రారంభించారు. శనివారం కలశావాహనం, ఆదివారం సహస్ర కలశాభిషేకోత్సవం జరపనున్నారు. కాగా శని, ఆదివారాల్లో నిత్యకల్యాణాలు నిలిపివేశారు.

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ టీపీ చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయిలో వైఎస్సార్ టీపీ నాయకుడు బండారు సురేష్‌రెడ్డి తండ్రి నారాయణరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈమేరకు వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల కార్యాలయ ఉద్యోగి నంద్యాల రవీందర్‌రెడ్డి ఆ కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ నాయకులు కొత్త బాలాజీరావు, రావుల జగన్నాథరెడ్డి, వాలూరి సత్యనారాయణ, అన్నబత్తుల కృష్ణ, ఏనుగంటి కృష్ణ నాయకులు రాజేష్, లక్‌పతి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

బావిస్థలం కోసం ఇరువర్గాల ఘర్షణ



ఇరువర్గాలకు సర్దిచెబుతున్న పోలీసులు

రఘునాథపాలెం: మండలంలోని రేగులచేలకలో పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న బావి, బావి స్థలం విషయమై శుక్రవారం ఇరువర్గాల నడుమ ఘర్షణ చోటు చేసుకుంది. ఈ స్థలం గతంలో ఉపసర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన యండపల్లి సత్యం పేరిట ఉండగా, ఆయన బావి తవ్వించాడు. అయితే, ప్రస్తుత సర్పంచ్ రామారావు భూమి, బావి తవ్వించిన నిధులు పంచాయతీకి సంబంధించినవి చెబుతుండడంతో వివాదం మొదలైంది. ఈమేరకు శుక్రవారం బావి నుంచి ట్యాంకర్ ద్వారా తరలించడానికి ఏర్పాట్లు చేస్తుండగా మాజీ ఉపసర్పంచ్ సత్యం చేరుకోవడంతో ఇరువర్గాల నడుమ ఘర్షణ జరిగింది. దీంతో ఎస్ఐ రవి సిబ్బందితో చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పగా.. పరస్పరం ఫిర్యాదులు చేశారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని పాదచారుడు మృతి

పెనుబల్లి : ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో పాదచా రుడు మృతి చెందాడు. పెనుబల్లి మండలం వీఎం బంజర్‌కు చెందిన వనమా సాంబశివరావు(67) గురువారం సాయంత్రం ఇంటి నుండి తన పంట పొలానికి బయలుదేరా డు. ఈక్రమంలో కిష్టారం వైపు నుండి వస్తున్న ద్విచక్రవాహనదారుడు సాంబశివరావును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడగా పెనుబల్లి ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడని వీఎం బంజర్ పోలీసులు తెలిపారు.

ఆయిల్‌పామ్ నర్సరీని పరిశీలించిన అధికారులు



నర్సరీలో పరిశీలిస్తున్న అధికారులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేగళ్లపాడులో టీఎస్ ఆయిల్‌ఫెడ్ నర్సరీని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ సహాయ సంచాలకురాలు కె.అనిత శుక్రవారం పరిశీలించారు. మండల ఉద్యాన అధికారి కె.మీనాక్షితో కలిసి నర్సరీలో పరిశీలించిన ఆమె రైతులకు నాణ్యమైన మొక్కలు సరఫరా చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆతర్వాత రుద్రాక్షపల్లిలో రైతులు కొబ్బరి తోటలో అంతర్ పంటగా వేసిన అరటి, వక్క మొక్కలను పరిశీలించారు.

కుటుంబానికి భారం కావొద్దని...

● వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం, భర్త మృతి

కామేపల్లి(కారేపల్లి): అనారోగ్యం బారిన పడి దంపతులు కుటుంబానికి భారం కావొద్దనే భావనతో పురుగుల మందు తాగి ఆత్మయత్నానికి పాల్పడగా భర్త మృతి చెందాడు. కామేపల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామేపల్లి మండలం ముద్దులపల్లికి చెందిన కొమ్మనబోయిన లచ్చయ్య(52) అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయన భార్య పద్మ కేన్సర్ బారిన పడింది. దీంతో వారు కుటుంబానికి భారం కావొద్దనే ఉద్దేశంతో గురువారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగారు. కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఖమ్మం తరలిస్తుండగా లచ్చయ్య మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, పద్మ పరిస్థితి విషమంగా ఉంది. ఘటనపై కుమారుడు వీరబాబు ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. చినమండవ మున్నేరు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈమేరకు ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పొదిల వెంకన్న వెల్లడించారు.

క్లుప్తంగా...


గోదావరిలో పుష్కర ఘాట్ వద్ద మొసలి

మొసలితో కలవరం

బాల్కొండ : నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ వద్ద గోదావరిలో వీఐపీ పుష్కర ఘాట్ వద్ద శుక్రవారం పెద్ద మొసలి కనిపించింది. దీంతో భక్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అటవీ అధికారులు స్పందించి వెంటనే గోదావరిలో మొసళ్లను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

అవకాశమిస్తే పాలకుర్తి నుంచి పోటీ చేస్తా..

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



తొర్రూరు: వచ్చే ఎన్నికల్లో పార్టీ అవకాశమిస్తే పాలకుర్తి నుంచి పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని టీచర్స్ కాలనీలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొండా మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే పాలకుర్తి నియోజకవర్గంలో ఎర్రబెల్లిపై పోటీ చేస్తానని తెలిపారు. ఈనెల 9న పాలకుర్తి దేవస్థానంలో పూజలు నిర్వహించి.. కార్యకర్తల అభీష్టం మేరకు నియోజకవర్గంలో కార్యక్రమాలు ప్రారంభిస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

క్రమబద్ధీకరణ హామీపై హర్షం

సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్టు ఉద్యోగుల సేవల క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతుందని గవర్నర్ తమిళిసై అసెంబ్లీలో ప్రకటించడాన్ని కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ స్వాగతించారు. ప్రభుత్వం క్రమబద్ధీకరణ జీవో జారీ చేసినా ఇంతవరకూ అమలు కాలేదని గుర్తు చేశారు.

బిల్లును ఓకే చేయించి.. అవిశ్వాసాలు ఆపేలా..!

- పురపాలికల్లో 'లొల్లి'కి చెక్‌పెట్టేందుకు సర్కారు ప్రయత్నాలు
- మేయర్లు, చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానానికి కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ గత అసెంబ్లీలో తీర్మానం
- సదరు బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్
- ఇదే అదనుగా పురపాలికల్లో అవిశ్వాస తీర్మానాల నోటీసులు
- గవర్నర్ ద్వారా బిల్లు ఆమోదింపజేసి వాటిని ఆపాలని ప్రభుత్వ యోచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో నెలకొన్న అవిశ్వాసాల గందరగోళానికి తెర దించాలని ప్రభుత్వం భావిస్తోంది. జనవరి 26తో మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకొన్న 127 పట్టణ, నగర పాలక మండళ్లలో చాలాచోట్ల లుకలుకలు బహిర్గతమయ్యాయి. పలుచోట్ల ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్లపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు కూడా ఇచ్చారు. కొన్ని పట్టణాల్లో క్యాంపులు, కొనుగోళ్ల పర్వం కూడా మొదలైంది. అవిశ్వాసాలు ప్రతిపాదించిన పట్టణాలు, నగరాల్లో అధికార బీఆర్‌ఎస్ పాలక మండళ్లే కొలువు తీరి ఉండటం, ప్రస్తుత మేయర్లు, చైర్‌పర్సన్లను గద్దె దించేందుకు సొంత పార్టీ ప్రతినిధులే అవిశ్వాసం నోటీసులు ఇవ్వడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే రంగంలోకి దిగింది. పట్టణ, నగర పాలక మండళ్లలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఉన్న కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ గత అసెంబ్లీ సమావేశాల్లో తీసుకొచ్చిన బిల్లు ఆమోదం పొందితే మరో ఏడాది వరకు సమస్య ఉండదని భావిస్తోంది. రెండు, మూడు రోజుల్లో మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం లభించేలా పావులు కదుపుతోంది.

ఇన్నాళ్లుగా పెండింగ్‌లో..

తెలంగాణ మున్సిపల్ చట్టం- 2019 ప్రకారం నగర, పురపాలక సంఘాల్లో మేయర్/ డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్ పర్సన్/వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించేందుకు.. పాలక మండలి ఏర్పాటైన నాటి నుంచి కనీసం మూడేళ్ల గడువు పూర్తయి ఉండాలి. ఈ నిబంధనకు సవరణ చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అవిశ్వాస కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ మున్సిపల్ చట్టం సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. అసెంబ్లీ ఆమోదించినా గవర్నర్ వద్ద పెండింగ్‌లో పడింది. రాష్ట్ర ప్రభుత్వానికి, రాజ్‌భవన్‌కు మధ్య ఏర్పడిన అగాథం నేపథ్యంలో గవర్నర్ వద్ద ఆగిన ఏడు బిల్లుల్లో మున్సిపల్ చట్ట సవరణ బిల్లు కూడా ఉంది. మరోవైపు రాష్ట్రంలోని పుర/నగర పాలక సంస్థల పాలక మండళ్లకు గత నెల 26తో మూడేళ్ల పదవీకాలం పూర్తయింది. ఇదే అదనుగా అసమ్మతి ప్రజాప్రతినిధులు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇవ్వడం మొదలుపెట్టారు. అవన్నీ కలెక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈలోపే చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందితే సమస్యకు చెక్‌పడుతుందని సర్కారు భావిస్తున్నట్టు సమాచారం.

రాజ్‌భవన్‌తో సయోధ్య కుదిరిన నేపథ్యంలో..

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఉన్నతస్థాయిలో కుదిరిన సయోధ్య నేపథ్యంలో.. గవర్నర్ తమిళిసై శుక్రవారం అసెంబ్లీలో ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ క్రమంలోనే గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న చట్ట సవరణ బిల్లులకు ఆమోదం పొందేలా ప్రభుత్వ వర్గాలు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. మున్సిపల్ చట్ట సవరణ బిల్లు విషయమై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ గవర్నర్‌ను కలవాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ బిల్లు విషయంలో గవర్నర్‌కు ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసి ఆమోదించాల్సిందిగా కోరాలని భావిస్తున్నట్టు తెలిసింది.


అసెంబ్లీని సందర్శించిన జర్మనీ ఎంపీల బృందం. చిత్రంలో పోచారం, కేటీఆర్ తదితరులు

అసెంబ్లీకి జర్మనీ బృందం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభను శుక్రవారం జర్మనీ బృందం సందర్శించింది. జర్మనీ, ఇండియన్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్‌లో భాగంగా రాష్ట్రాన్ని సందర్శించిన జర్మనీ పార్లమెంట్ సభ్యుల బృందం శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావుతో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యాపార అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు తదితర అంశాలను మంత్రి జర్మనీ బృందానికి వివరించారు. సమావేశంలో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జి జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి జర్మనీ బృంద సభ్యులను శాలువా, మెమెంటోతో సత్కరించారు.

నేడు బుర్రవీణ.. మధుర గానం

బుర్రవీణకు చిట్టచివరి చిరునామా దాసరి కొండప్ప

- ఇండో–ఫ్రెంచ్ సంగీత కచేరీలో పాల్గొననున్న నారాయణపేట కళాకారుడు
- మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కార్యక్రమం

నారాయణపేట: నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్పకు శనివారం హైదరాబాద్‌లో జరిగే ఓ సంగీత కచేరీలో ఫ్రెంచ్ కళాకారుడు అజరక్ అలెగ్జాండ్రా జురైన్‌తో కలిసి పాల్గొనే అవకాశం వచ్చింది. ఇన్‌స్టిట్యూట్ ఫ్రాంకైస్, అలైన్స్ ఫ్రాంకైస్ ఆఫ్ హైదరాబాద్, స్టేట్ ఆర్ట్ గ్యాలరీల సంయుక్త ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. జురైన్ 25 ఏళ్లుగా భారతీయ సంగీతాన్ని శాంతినికేతన్ కేంద్రంగా అభ్యసించారు. జురైన్ తంత్రి వాదకుడు. డప్పు, డిడ్‌గిరిడో అనే ఊదే వాద్య నిపుణుడు.

రాగాలాపనలో దిట్ట

కొండప్ప జానపద సంగీతకారుడైనప్పటికీ అనేక రకాల రాగాలను ఆలపించడంలో దిట్ట. జానపదం, శాస్త్రీయ సంగీత రంగంలో అతనొక అద్భుత కళాకారుడు. కడుపేద స్థితిలో జీవిస్తున్నా సంగీతాన్నే నమ్ముకున్నాడు. సంగీతం అతని వృత్తి కాగా.. ప్రవృత్తి గానం. ఆకలితో అలమటిస్తున్నా.. శక్తి లేకపోయినా ఆ వాద్యమే.. ఆ రాగాలే అతని అపురూప


బుర్రవీణ వాయిస్తున్న దాసరి కొండప్ప

స్నేహితులు. బుర్రవీణ వాద్యాన్ని అద్భుతంగా వాయించే చిట్టచివరి కళాకారుడు ఆయనే కావడం.. ఆ వాద్యం అతనితోనే అంతరించిపోతుండడం బాధాకరం. విల్లాడి వాద్యం, భూమి వీణ వంటివి ఇంకా గిరిజనుల్లో బతికి ఉన్న మూల సంగీత వాద్య అవశేషాలు. అలాంటి కోవకు చెందినదే బుర్రవీణ వాయిద్యం. కొండప్పకు కళాకారుల కోటా పింఛను రావడం లేదు. భిక్షాటన చేస్తూ తత్వ గీతాలు, కథలు చెబుతూ బతుకు బండిని అతికష్టంగా లాగుతున్నాడు.

జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసులు

జనగామ: జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్‌పై అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు శుక్రవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి అవిశ్వాస నోటీసులు అందజేశారు. తొమ్మిది రోజులపాటు క్యాంపు రాజకీయం నడిపించిన అధికార పక్షం ఆ ఇద్దరిని తొలగించాలని కోరుతూ 11 మంది బీఆర్‌ఎస్, 8 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు వేర్వేరుగా అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. ఫ్లోర్‌లీడర్ మారబోయిన పాండును తొలగించాలని అధిష్టానాన్ని కోరినట్లు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తెలిపారు. కాంట్రాక్టర్లు, ఇళ్లనిర్మాణ అనుమతులకు కమీషన్లు వసూలు చేస్తూ పార్టీని అప్రతిష్టపాలు చేస్తుండటంతో అవిశ్వాసం నోటీసులు ఇచ్చినట్లు చైర్‌పర్సన్ రేసులో


ఏసీకి అవిశ్వాస ప్రకటన అందిస్తున్న అధికార, ప్రతిపక్ష సభ్యులు

ఉన్న 19వ వార్డు సభ్యురాలు బండ పద్మ తెలిపారు. కాగా, నలుగురు బీజేపీ సభ్యులు కూడా తమతో టచ్‌లో ఉన్నారని ఆమె చెప్పారు.

రాజకీయ రిజర్వేషన్లు చట్టబద్ధం చేయాలి

సాక్షి, న్యూఢిల్లీ: బీసీ ప్రధానమంత్రి మోదీ హయాంలోనే బీసీ లకు 27 శాతం రాజకీయ రిజర్వేషన్లను చట్టబద్ధం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. ఆయన ఢిల్లీలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 75 ఏళ్లుగా అగ్రవర్ణాలు, కార్పొరేట్ శక్తు లు తీవ్ర వివక్షకు గురిచేయడంతో చేతివృత్తుల వారు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి ఢిల్లీ కేంద్ర కమిటీ కన్వీనర్ ప్రకాష్ వర్మ పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పకుంటే జైలుకే..

న్యాయవాది బాలముకుంద్‌పై ధిక్కార కేసులో హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: న్యాయమూర్తికి షోకాజ్ నోటీసు జారీ చేసినందుకు న్యాయవాది బాలముకుంద్‌రావుపై కోర్టు ధిక్కార కేసు నమోదైంది. బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే జైలుకు పంపిస్తామని చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం ముకుంద్‌రావును హెచ్చరించింది. టూరిజం శాఖను సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ పి.మాధవిదేవి కోర్టు హాల్లో జడ్జితోపాటు ఇతర న్యాయవాదులతో ఆయన పరుషంగా మాట్లాడారు. పైగా కేసుకు సంబంధించి వారం రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ న్యాయమూర్తికీ నోటీసులిచ్చారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం బాలముకుంద్‌రావుపై క్రిమినల్ ధిక్కార చర్యలు చేపట్టి విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా ఏజీ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఘటన జరిగిన తర్వాత కూడా న్యాయమూర్తికి క్షమాపణ చెప్పలేదన్నారు.


జిల్లా వార్తలు

భద్రాద్రిలో నిత్యాన్న దానానికి విరాళం


దాతలకు రశీదు ఇస్తున్న సిబ్బంది

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఎన్‌ఆర్‌ఐ దంపతులు నగదు విరాళంగా అందజేశారు. ఈమేరకు ఆజ్జ రఘు సురేంద్రశర్మ–సంధ్య శుక్రవారం రూ.51,116ను ఆలయ అధికారులకు అందించగా వారు ప్రత్యేక పూజలు చేయించి, రశీదు అందజేశారు.

ప్రభుత్వ శిక్షణతో ఉద్యోగాలు సాధించాలి


మాట్లాడుతున్న డీడీ రమాదేవి

భద్రాచలం: నిరుద్యోగులైన గిరిజన అభ్యర్థులు ప్రభుత్వ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని భద్రాచలం ఐటీడీఏ డీడీ రమాదేవి సూచించారు. ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవనంలో ఎస్‌ఐ, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల ఉచిత శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. మొత్తం 300 మందికి రెండు నెలల పాటు నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ ఇప్పిస్తుండగా, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు పౌష్టికాహారంతో పాటు ఉచిత వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్యతో పాటు అధికారులు నర్సింహారావు, సర్వేశ్వర్‌దొర, సతీశ్, వెంకటేశ్వరరావు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొనుగోళ్లు.. సోమవారం సెలవు

ఖమ్మంవ్యవసాయం: ఖమం వ్యవసాయ మార్కెట్‌లో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు శనివారం కొనసాగుతాయని ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం తెలిపారు. అయితే, లింగమంతుల జాతర సందర్భంగా సోమవారం మార్కెట్‌కు సెలవు ప్రకటించిన నేపథ్యాన.. రైతులు ఇబ్బంది పడకుండా శనివారం సాధారణ సెలవు అయినా కొనుగోళ్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఆది, సోమవారం సెలవుల అనంతరం మంగళవారం నుంచి అన్ని పంటల కొనుగోళ్లు జరుగుతాయని తెలిపారు.

'కళాతపస్వి'తో జ్ఞాపకాలెన్నో...

- పలుసార్లు ఉమ్మడి జిల్లాకు వచ్చిన దర్శకుడు విశ్వనాథ్
- వివిధ సంస్థల ఆధ్వర్యాన సన్మానాలు

ఖమ్మం గాంధీచౌక్/భద్రాచలం: భిన్న కథాంశాలతో సినిమాలు తీసి అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకున్న దర్శక దిగ్గజం, కళా తపస్వి కాశీనాథుని విశ్వనాథ్‌కు ఖమ్మంతో ప్రత్యేక అనుబంధం ఉంది. వృద్ధాప్యంతో గురువారం రాత్రి ఆయన మృతి చెందగా జిల్లా ప్రేక్షకులు, అభిమానులు విశ్వనాథ్‌తో అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ సంతాపం ప్రకటించారు. విశ్వనాథ్ పద్మశ్రీ అవార్డు పొందిన సందర్భంగా 2002లో చిల్డ్రన్స్ ఫిలం సొసైటీ ఆధ్వర్యంలో బెల్లంకొండ బాబాజీ, రంగస్థల నటి వనం కృష్ణవేణి తదితరుల ఆధ్వర్యాన ఖమ్మంలో ఘనంగా సన్మానించారు. అప్పుడు సతీసమేతంగా వచ్చిన ఆయన మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. అలాగే, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు పొందిన సందర్భంగా 2018లో వనం కృష్ణవేణి తదితరులు విశ్వనాథ్‌ను ఖమ్మంలో సత్కరించి ప్రస్తుత ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బహూకరించిన స్వర్ణకంకణాన్ని తొడిగారు. ఈ సందర్భంగా బ్రాహ్మణసంఘం వారు కూడా కళాతపస్విని సత్క


2018లో ఖమ్మంలో విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న వనం కృష్ణవేణి, తదితరులు

రించారు. కాగా, ఆయన మృతిపై ఖమ్మంకు చెందిన నటుడు నాగబత్తిని రవి, రిటైర్డ్ లెక్చరర్ కలివెల పద్మజ, సామాజిక వేత్త డాక్టర్ కడవెండి వేణుగోపాల్, కవి, రచయిత అట్లూరి వెంకటరమణ తదితరులు సంతాపం ప్రకటించారు.

'భద్రాద్రి' రామయ్యకు పూజలు

ప్రముఖ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ పలుమార్లు భద్రాచలం వచ్చారు. ఈక్రమంలో రామాలయాన్ని దర్శించి పూజలు చేశారు. తొలిసారి 2003లో భద్రాచలానికి చెందిన భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యాన నిర్వహించిన నాటకోత్సవాల హాజరైనప్పుడు శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం 2004లో సాయికుమార్ హీరోగా నటించిన 'శ్లోకం' చిత్రం షూటింగ్ సందర్భంగా కూడా భద్రాచలం వచ్చారు. ఈ చిత్రాన్ని భద్రాచలం, పరిసర ప్రాంతాలైన సారపాక, బూర్గంపాడు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించగా సాయి కుమార్ తండ్రిగా విశ్వనాథ్ నటించారు.


విశ్వనాథ్‌కు జ్ఞాపిక ఇస్తున్న రిటైర్డ్ లెక్చరర్ పద్మజ


విశ్వనాథ్‌తో సామాజికవేత్త వేణుగోపాల్


విశ్వనాథ్‌తో కళాభారతి అధ్యక్షుడు నాగేశ్వరరావు

అసెంబ్లీలో మనోళ్లు..


మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య, చిత్రంలో మంత్రి హరీశ్‌రావు






అసెంబ్లీ సమావేశాల సందర్భంగా హాల్‌లోకి వెళ్తున్న కొత్తగూడెం, అశ్వారావుపేట, వైరా, ఇల్లెందు, భద్రాచలం ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, లావుడ్యా రాములునాయక్, బానోతు హరిప్రియ, పోదెం వీరయ్య

ఆలయ నిర్మాణానికి రూ.3లక్షల విరాళం


నగదు అందజేస్తున్న యజమానులు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం సీతారామపురంలో శ్రీ సీతారామచంద్ర మూర్తి స్వామి ఆలయ నిర్మాణానికి గాను గ్రానైట్ పరిశ్రమల యజమానులు రూ.3లక్షల విరాళం ప్రకటించారు. ఈమేరకు ఆరెంపుల, బారుగూడెం, కొక్కిరేణి, సీతారామపురం గ్రామాల్లోని గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఈ విరాళాన్ని శుక్రవారం ఆలయ కమిటీ బాధ్యులకు అందజేశారు. యజమానులు వేముల రవికుమార్, మల్లెల శ్రీనివాసరావు, తీగల విజయ్, నల్ల శ్రీనివాసరెడ్డి, కొనకంచి శ్రీనివాసరావు, భాస్కర్, పణికుమార్, గోపాలరావు పాల్గొన్నారు.

తపాలా పథకాల్లో పరిమితులు పెంపు

- తాజా బడ్జెట్‌లో వెల్లడించిన కేంద్రప్రభుత్వం
- ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్


ఖమ్మంగాంధీచౌక్: కేంద్రప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తపాలా పథకాలకు సంబంధించి ప్రజలకు మరింత లాభం జరిగేలా నిర్ణయాలు తీసుకుందని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ వెల్లడించారు. ఈమేరకు శుక్రవారం వివరాలను వెల్లడించిన ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు.

- నెలవారీ ఆదాయ పథకంలో(ఎంఐఎస్) సింగిల్ ఖాతాకు అత్యధిక పరిమితి రూ.4.50 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు, జాయింట్ ఖాతాకు రూ.9 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పెంచారు. వడ్డీరేటు 6.7 శాతంగా నిర్ణయించారు.
- సీనియర్ సిటిజన్ సేవింగ్స్ పథకంలో ఇప్పటి వరకు ఉన్న అత్యధిక పరిమితి రూ.15 లక్షలను రూ.30 లక్షల వరకు పెంచడమే కాక వడ్డీ రేటు 8శాతంగా నిర్ణయించారు.
- మహిళా బచత్ సమ్మాన్ యోజన(మహిళ, ఆడపిల్లల భవిష్యత్ కోసం) ప్రత్యేక పథకాన్ని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా గరిష్టంగా రెండేళ్ల కాలానికి గాను రూ.2 లక్షల వరకు జమ చేసుకోవచ్చు. వడ్డీ రేటు 7.5 శాతంగా నిర్ణయించారు. ఇందులో నుంచి పాక్షికంగా ఉపసంహరించుకునే సౌకర్యం ఉంది.
- ఈ-కామర్స్ బిజినెస్ పెంచడానికి పార్సిల్ బుకింగ్ సెంటర్లు, స్పీడ్ పోస్ట్ హబ్‌లు, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్స్, ఇంటర్నేషనల్ బిజినెస్ సెంటర్లు, డాక్ నిర్యత్ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు.
- నక్సల్ ప్రభావిత ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో తపాలా సేవలను విస్తృతపరిచేలా నూతన పోస్టాఫీసులు ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేశారు.
- కామన్ సర్వీస్ సెంటర్లను పెంచి పీఎం స్వనిధి, ఆయుష్మాన్ భారత్, పీఎం ఎస్‌వైఎం, పీఎం ఎల్‌వైఎం వంటి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇచ్చారు.

జిమ్మిక్కులే తప్ప సంక్షేమం లేదు..

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర బడ్జెట్ మొత్తం రాజకీయ జిమ్మిక్కు తప్ప.. సంక్షేమ పథకాలు, పేదల ఊసే లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఖమ్మం సుందరయ్యభవన్‌లో శుక్రవారం పొన్నం వెంకటేశ్వరరావు అధ్యక్షతన సీపీఎం జిల్లా కమిటీ, మండల కార్యదర్శుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వీరభద్రం మాట్లాడుతూ దేశం ప్రస్తుతం ఆర్థిక ఒడిదుడుకులనే కాక నిరుద్యోగం, ఆరోగ్యం, విద్య తదితర ముఖ్యమైన సమస్యలను బడ్జెట్‌లో ప్రస్తావించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహార సబ్సిడీని 29 శాతానికి తగ్గించగా, మధ్యాహ్న భోజనానికి నిధులు 9.4 శాతం, పౌష్టికాహార పథకాలకు ఏకంగా 38 శాతం తగ్గించారని ఆరోపించారు. నీతి ఆయోగ్ మార్గదర్శకాల ప్రకారం షెడ్యూల్ కులాలు, తెగల


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం, పక్కన నాయకులు

సంక్షేమానికి జనాభా దామాషా ప్రకారం కేటాయింపులు తప్పనిసరి అయినా అలా చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఇక దివ్యాంగులు, మైనార్టీల సంక్షేమానికి కూడా బడ్జెట్ తగ్గించారని వీరభద్రం తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు మాచర్ల భారతి, బొంతు రాంబాబు, వె.విక్రమ్, చింతలచెర్వు కోటేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బండి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయండి..

భద్రాచలం: గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలల్లోని విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ ఆదేశించారు. ఐటీడీఏ నుంచి శుక్రవారం ఆయన పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమావేశమై పదో తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాల్సిన తీరుపై


మాట్లాడుతున్న ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్

సూచనలిచ్చారు. త్వరగా సిలబస్ పూర్తి చేసి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. అలాగే, టెండరుదారులు సరఫరా చేసే వస్తువులు, సామగ్రి నాణ్యతను పరిశీలించాలని చెప్పారు.